ఎరువుల వినియోగం.. సమతుల్యతే కీలకం

- రసాయన ఎరువులను పరిమితం చేయడం ముఖ్యం
- పశువుల ఎరువులు, నూనె గింజల చెక్క వినియోగించడం ఉత్తమం
- రెండేళ్లకోసారి భూసార పరీక్షలు అవసరం
- డ్రిప్ ద్వారా ఎరువుల వినియోగంలో వృథాకు చెక్
- పంట మార్పిడితో అధిక ఉపయోగాలు
- రెతులకు కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న కర్నూలు ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): పంటల సాగులో 25 నుంచి 35 శాతం ఎరువులకే ఖర్చు అవుతుంది. రైతాంగం ఎరువుల వాడకంలో తగినంత శ్రద్ధ, మెళకువలు పాటించకపోవడం వల్ల వేసిన ఎరువుల్లో దాదాపు 50 శాతం వృథా అవుతున్నాయి. కేవలం రసాయన ఎరువులనే వినియోగించడం వల్ల ఉపయోగం ఉండదు, వీటితో పాటు పశువుల ఎరువులు, కంపోస్ట్ ఎరువులు తదితర సేంద్రియ ఎరువులు వినియోగించాలి. అప్పుడే ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించినట్లు అవుతుంది. తద్వార భూమి ఆరోగ్యం అభివృద్ధి చెందుతుంది. ఖరీఫ్ పనులు మొదలైన నేపథ్యంలో ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించి సేంద్రియ కర్బణాన్ని పెంచుకునేందుకు వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎన్.సాలురెడ్డి సూచనలు.

రైతులు పాటించాల్సిన సూచనలు:

- ప్రతి రెండు మూడేళ్లకోసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడాలి.
- రసాయన ఎరువులలో పాటు సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, గొర్రెలు, మేకల పెంట ఎరువు, నూనె గింజల చెక్క, పచ్చి ఆకు జీవన ఎరువులు లాంటివి విరివిగా ఉపోయగించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయి. భూమిలోకి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడులు నిలకడగా ఉంటాయి.
- పంటలకు నత్రజని ఎరువులను నల్లరేగడి నేలలో మూడు దఫాలుగా, తేలిక నేలలో నాలుగు దఫాలుగా వేయాలి. సిఫార్సు చేసిన మొత్తం భాస్వరపు ఎరువులను ఆఖరి దుక్కిలో గాని, దమ్ములో విత్తనానికి ముందుగాని వేయాలి.
- భాస్వరం ఎరువులు (సూపర్ ఫాస్పేట్) జింక్ సల్ఫేట్ కలిపి వేయరాదు. భాస్వరపు ఎరువులు వేసిన రెండు లేక మూడు రోజుల తర్వాత జింక్ వేసి భూమిలో కలియ దున్నాలి.
- వేరు శనగలో ధృడమైన కాయలు, గింజల్లో నూనెశాతం పెరగడానికి ఎకరానికి రెండు వందల కిలోల మెత్తగా పొడి చేసిన జిప్సమ్‌ను పూత సమయంలో నేల పొరల్లో తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి.
- పంట మార్పిడి విధిగా పాటించాలి. పంట మార్పిడిలో పప్పు ధాన్యాలు, వేరుశనగ తదితర పంటల వల్ల వాటి వేర్ల బుడిపేల్లో రైజోబియం బ్యాక్టీరియం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తాయి. దీని వల్ల నత్రజని, ఎరువులపై పెట్టే ఖర్చులను కొంత వరకు తగ్గించుకోవచ్చు.
- భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లను ఎక్కువ లోతుకు చొచ్చుకెళ్లే పైర్లతో పంట మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో తేమ, పోషక పదార్థాలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.
- అదునులోనే విత్తడం, నాట్లు వేయడం చేపట్టాలి.
- సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించడం వల్ల నేలలో సూక్ష్మ జీవుల సంఖ్య పెరిగి మొక్కలకు పోషక పదార్థాలు అందేలా చేస్తాయి. జీవన ఎరువులతో నేలలో ఉత్పాదక శక్తి పెరిగి భూ భౌతిక స్థితి, సూక్ష్మ జీవుల చర్యలతో స్థిరమైన దిగుబడులు పొందడానికి ఆస్కారం ఉంటుంది. రసాయనిక ఎరువుల వినియోగాన్ని 20 నుంచి 30 శాతం తగ్గించుకోవచ్చు.

డ్రిప్ ద్వారా ఎరువులను వేయడం వల్ల వృథాను అరికట్టవచ్చు. ఎకరాకు తగినన్ని మొక్కలు ఉండేలా జాగ్రత్త వహించాలి. లేకుంటే ఎరువులు వృథా అవుతాయి.

- ఫాస్పేట్, పొటాష్ కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగిన కారణంగా రైతులు తక్కువ ధరతో లభిస్తున్న యూరియాను వాడి పంటలను అధిక చీడపీడలకు గురిచేస్తున్నారు. పోషక పదార్థాల మధ్య ఉండాల్సిన సమతుల్యాన్ని దెబ్బతిసి నేలను నిస్సారమయ్యేలా చేస్తున్నారు. రైతులు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను 4:2:1 నిష్పత్తిలో ఉపయోగించాలి.
- పంటలకు ఎక్కువ మోతాదులో కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను కాంప్లెక్స్ ఎరువుల కంటే సూటి ఎరువులు (యూరియా, సూపర్ ఫాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్) రూపంలో వేయడం వల్ల తక్కువ ధరలో పోషక పదార్థాలను పైర్లకు అందించవచ్చు.

క్లుప్తంగా

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఉపాధిహామీ అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి ఉపాధిహామీ పథకం కింద పండ్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని ఏపీడీ అల్లిపీర ఉపాధిహామీ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ లక్ష్మన్న, మండల అధికారులతో కలిసి టీఏలు, ఎఫ్ఏలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. రెగ్యులర్ పనులే కాకుండా రైతుల పొలాల్లో పండ్లు, పూల మొక్కల పెంపకంపై సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా వచ్చే ఏడాది చేపట్టే పనుల్లో ఫారంపాండ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సీడీసీఎల్ఆర్‌సీ సుజాతమ్మ, ఈసీ పృథ్వీరాజ్, ప్లానిటేషన్ సూపర్‌వైజర్ వితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ఈర్లదిన్నె సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా సచివాలయాల్లో తనిఖీ చేశారు. ఈర్లదిన్నె గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడారు. ఉద్యోగుల పనితీరు, హాజరుపై ఆయా గ్రామాల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాలు

గడివేముల: మండలంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల డిమాండ్ల దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ జమానుల్లా ఖాన్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

భవిత కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు దండేపాల్

పాణ్యం: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర భవిత కేంద్రాల పరిశీలకుడు దండేపాల్ అన్నారు. బుధవారం పాణ్యంలోని భవిత కేంద్రంలో ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉన్నత విద్య అభ్యసించేలా వారిని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కేంద్రంలోని రికార్డులు, బయోమెట్రిక్, హాజరును పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. భవిత కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, క్రిష్ణప్రియ, సాయిప్రసాద్, సంపూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా పట్టివేత



సారా, బైక్‌ను చూపుతున్న సెబ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గోపాల్ నాయక్ బైక్‌పై తరలిస్తున్న 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. గోపాల్‌నాయక్‌పై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు. 10 లీటర్ల సారా, బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో లక్ష్యాలను సాధిద్దాం

- ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ మల్లీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సమన్వయంతో సాధిద్దామని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ సిబ్బందితో హౌసింగ్ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, ఉప్పలపాడు, కేతవరం, కన్నమడకల గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన గృహ నిర్మాణ పనులను మొదలు పెట్టించి త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా వంద శాతం నిర్మాణాలను పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో ముందుకెళ్లాలని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 70 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగతా 30 శాతం ఇళ్లను గడువులోగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 99 రోజుల పనిదినాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. గడువులోగా నిర్మించుకోని ఇళ్లను రద్దు చేసి అర్హులైన వారికి మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై ప్రభుత్వం స్పందించాలి

- అంతర్జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనీషా పాషా



అనీషా పాషా

ఓర్వకల్లు: మహిళల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అంతర్జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనీషా పాషా అన్నారు. ఇటీవల నంద్యాల జిల్లాలో జరిగిన ఓ మైనర్ బాలిక ఉదంతాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. బుధవారం నన్నూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక జీవితం విషాదంగా మారడం మనస్సును కలిచివేసిందన్నారు. అభం శుభం తెలియని మైనర్ బాలికను అపహరించి, దురాగతానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికపై జరిగిన ఉదంతం సమాజం సిగ్గుతో తలదించుకునే విషయమన్నారు. ఈ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళలపై జరుగుతున్న అరాచకాలకు కఠినమైన శిక్షలు ప్రవేశపెట్టాలని కోరారు. నేరస్తులకు మహిళలపై అత్యాచారం, హత్యచేయడం మామూలు విషయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, మహిళలపై జరిగే అరాచకాలు మాత్రం ఆగడం లేదని వాపోయారు. ఇలాంటి ఘటనలు నంద్యాల జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైన జిల్లా ఎస్పీ స్పందించి ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని ఐహెచ్ఆర్‌సీ తరుపున కోరుతున్నట్లు తెలిపారు. యువత మత్తుకు బానిసలై, పెడదారిపట్టి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ



సచివాలయంలో హౌసింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న సిద్ధలింగమూర్తి

కోడుమూరు రూరల్: డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ప్యాలకుర్తిలోని జగనన్న కాలనీని బుధవారం ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించిన అనంతరం ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందితో చర్చించారు. వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి 100 రోజుల్లోగా పూర్తి చేసుకునేలా చూడాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుకు సూచించారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కల్లూరు: పందిపాడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. బుధవారం మాధవీ నగర్‌లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఇందిరమ్మ కాలనీ వాసులు కలిసి సమస్యలపై వినతి పత్రమిచ్చారు. 2009లో 2500 మంది పేదలకు నాటి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చిందన్నారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాము, నాగరాజు, గోకారి, అన్వర్ బాష, కాశమ్మ, నాగేంద్రుడు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ పరిధిలోని 524 కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిశారు. కొంతమంది వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టించి తమకు ఇంటి పన్నులు, కుళాయిలు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

ఏపీ హంస నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్

కర్నూలు (హాస్పిటల్) : ఏపీ హంస అసోసియేషన్ కర్నూలు సిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సహకారం వల్లే కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా టి.గోవిందు, కార్యదర్శిగా చక్రధర్, ట్రెజరర్‌గా శివుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటస్వామి, జాయింట్ సెక్రటరీగా లిల్లీ, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సంపత్, ప్రసూన, సునీత, ప్రభాకర్‌రెడ్డి, వీణా కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణుగోపాల్, ఉమెన్ వింగ్ సెక్రటరీగా సరస్వతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీ హంస రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనత నివారణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శరీరంలో రక్తహీనత సమస్యను ఫోలిక్ యాసిడ్ మాత్రలు తగ్గిస్తాయని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సందర్శించి ఫోలిక్ యాసిడ్ మాత్రల ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించాలని సిబ్బందికి చెప్పారు. ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి పీరియడ్స్ సమయంలో అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. గర్భధారణ సమయంలో ఫోలిక్ ఆమ్లము లేకపోవడం వల్ల జన్మించే పిల్లల్లో లోపాలు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, పాలు, పండ్లు తినడం ద్వారా రక్తహీనత రాకుండా నివారించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త హేమలత మాట్లాడుతూ సున్నా నుంచి 18 ఏళ్ల వయస్సు గల విద్యార్థుల్లో వచ్చే వ్యాధులు, లోపాలను ఈ శిక్షణ కార్యక్రమంలో వివరించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి లోపాల ఉంటే వారిని వైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లి సత్వర చికిత్స అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

అవసరమైన అందరికీ వైద్యపరీక్షలు చేయించాలి

అవసరమైన వారందరికీ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించి చికిత్స అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం నగర శివారులోని ప్రజానగర్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక రోజు ముందుగానే ఆరోగ్యసేవలు అవసరమైన వారికి సమాచారం అందించాలన్నారు. గర్భిణిలకు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, అందులో రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్సలు ఇవ్వాలని చెప్పారు. అనంతరం అక్కడే జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి గర్భిణిలు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాఘవులు, డీపీఎం ప్రసాద్, ఆరోగ్యపర్యవేక్షకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి పాణ్యం నుంచి బస్టాండ్ వైపు సైకిల్‌పై వస్తున్న సోమన్నను రఫీ అనే యువకుడు బైక్‌పై ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వీరిని పాణ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే కొండజుటూరు గ్రామ సమీపంలోని వడ్డుగండ్ల చెరువు వద్ద కారు బైక్ ఢీకొనడంతో పిన్నాపురం రాముడు అనే వ్యక్తి గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

15న నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఈనెల 15వ తేదీ కర్నూలు నగర పాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో 11 అంశాలకు సంబంధించిన అజెండాపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గత ఫిబ్రవరి నెల 17 న చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

'హలో కేఎంసీ'కి విశేష స్పందన

కర్నూలు (టౌన్): నగరపాలక వినూత్నంగా ప్రవేశపెట్టిన హలో కేఎంసీ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు నగరపాలక మేనేజర్ చిన్న రాముడు అన్నారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సోమవారం నుంచి ఇప్పటి వరకు మూడు రోజుల్లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 180 కి పైగ ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. వాటన్నింటిని రిజిస్టర్ చేసుకొని సంబందిత విభాగాలకు పంపించడం జరిగిందన్నారు. హెల్ప్ లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారించాలని ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

పెద్దాస్పత్రిలో యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ పనులు

- ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశం



ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తూ అధికారులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజి మరమ్మతుల పనులు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆర్థో ఓటీ విభాగంలో అల్యూమినియం డోర్స్ మరమ్మతులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సర్జికల్ వార్డులో డ్రైనేజీ సమస్యల గురించి ఆరా తీశారు. ఇక్కడ టైల్స్, లైట్ల మరమ్మతులు పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. డైట్ విభాగంలో ఎంత మంది రోగులకు, డాక్టర్లకు భోజనాలు ఇస్తున్నారని ఆరా తీశారు. రోగులకు రుచికర భోజనం అందించాలని, డైట్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఎలక్ట్రికల్ లైట్లు, ఫ్యాన్లు మరమ్మతులు ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని నర్సింగ్ సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ నర్సింగ్ సూపరింటెండెంట్ రౌండ్స్ నిర్వహించి ఆయా విభాగాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే దానిని పరిష్కరిస్తానని తెలిపారు. ఆస్పత్రిలో 150 ట్యూబ్ లైట్లను వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని ఏడీ రమేష్‌బాబును ఆదేశించారు. జీవనధార మెడికల్‌షాపులు తనిఖీలు చేసి, అక్కడ ఏఏ మందులు విక్రయిస్తున్నారని ఆరా తీశారు. ఈ షాపులను ఫార్మసి మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ ఉన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే పిటీ కేసులు

- ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరిక
- నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్



చెన్నమ్మ సర్కిల్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు (టౌన్) : ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారిపై పీటీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని కర్నూలు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. స్థానిక చెన్నమ్మ సర్కిల్‌లో రోడ్ల మీద పండ్ల బండ్లు, టిఫిన్ బండ్లు, బజ్జీల బండ్లు, మొబైల్ క్యాంటీన్లు పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందడంతో ఆ ప్రాంతంలో సీఐ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొబైల్ క్యాంటీన్లు, టిఫిన్ బండ్లను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ప్రతి ఆటోకు టాప్ నెంబర్

నగరంలో ప్రతి ఆటో టాప్‌కు నంబర్‌తో పాటు ఆటోకు సంబంధించిన పూర్తి రికార్డుల వివరాలు ఉండాలని కర్నూలు ట్రాఫిక్ సీఐ గౌతమి స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన సీఐ ప్యాసింజర్ ఆటోడ్రైవర్లు, ఓనర్లకు ఆటో టాప్ నంబర్లపై అవగాహన కల్పించారు. అలాగే నగరంలో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రచారం చేపట్టారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ రికార్డులను తప్పనిసరిగా కలిగా ఉండాలని సీఐ సూచించారు. ఈనెల 15వతేదీ లోపు ప్రతి ఆటోడ్రైవర్, ఓనర్ సరైన రికార్డులను చూపించి ఆటో టాప్ నంబర్లను తీసుకోవాలన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

వైద్య సేవలపై అవగాహన

కల్లూరు: నర్సింగ్ విద్యార్థులకు వైద్య సేవలపై అవగాహన ఉండాలని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ రఘు అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటలో భాగంగా ఉలిందకొండ గ్రామంలో ఆంటినేటల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది విద్యార్థులకు వైద్య సేవల గురించి వివరించారు. అనంతనం ప్రజలు, గర్భిణులకు రక్త పరీక్షలు చేసి మందులు, గుడ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు నవీన్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వసంత కుమారి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు నిర్మల, సురేఖ పాల్గొన్నారు.



గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది